సంపుటి :02 సంచిక :201 పేజీలు :04

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శనివారం 04, అక్టోబర్ 2025

ఎన్నికల నిర్వహణకు

## పటిష్ట కార్యాచరణ

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

03



మార్కెట్ కార్యదర్శి

## దీర్ఘకాలిక సెలవు

- సీసీఐ కొనుగోళ్ల వేళ చర్చనీయాంశం!
- వరంగల్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎఫ్‌పీసీ గుగులోతు రెడ్డి అక్టోబర్ 4 నుంచి లాంగ్ లీవ్
- పూర్తిస్థాయి కార్యదర్శి నియామకంపై ఉత్కంఠ

03



ప్రాదేశిక స్థానం

# ‘హస్త’గత వ్యూహం


## లోకల్ ఎన్నికలకు కాంగ్రెస్ రెడీ

- జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థుల కోసం వేట
- పీసీసీకి జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతలు
- ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతలు డీసీసీలకు

స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎలక్షన్లలో గెలుపు గుర్రాలను ఎంపిక చేయడంపై పార్టీ ముఖ్య నేతలు దృష్టిపెట్టారు. పార్టీ హైకమాండ్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఎంపిక ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక ఉండాలని భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, స్థానిక సంస్థల్లోనూ తమ పట్టును నిలుపుకోవాలనీ, ముఖ్యంగా రాష్ట్రంలో తమ పాలనపై ప్రజల ఆమోదాన్ని మరోసారి చాటుకోవాలని పటిష్టమైన వ్యూహాన్ని రూపొందించింది. ఎంపీటీసీ స్థానాల అభ్యర్థుల ఎంపిక బాధ్యతలను ఆయా జిల్లాల పరిధిలోని డీసీసీలకు అప్పగించింది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02



# 42%

## బీసీ రిజర్వేషన్లపై



సుప్రీంకోర్టులో

# పిటిషన్

- తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సందిగ్ధత
- ఇప్పటికే హైకోర్టులో ఒక పిటిషన్.. ఈ నెల 8న విచారణ
- ఈలోపే సుప్రీం కోర్టులో మరో పిటిషన్
- రాజకీయ వర్గాల్లో తీవ్రమైన ఉత్కంఠ

04



## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి

- ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని ప్రశ్నించిన పిటిషనర్ల తరఫు న్యాయవాదులు
- అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో విచారణ

02

ఇక గంటల్లోనే


## చెక్కుల క్లియరెన్స్

- ఆర్‌బీఐ నూతన విధానం అమలు
- శనివారం నుంచే కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థ ప్రారంభం
- 2026 జనవరి నుంచి కేవలం 3 గంటల్లోనే నగదు జమ

02

సాంకేతిక పరిజ్ఞానం విస్తరించాక బ్యాంకింగ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మొబైల్ అప్లికేషన్ల సాయంతో క్షణాల్లోనే నగదు బదిలీ జరిగే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. అయినప్పటికీ, చెక్కుల క్లియరెన్స్ విషయంలో మాత్రం ఆలస్యం ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక చెక్కు క్లియర్ కావడానికి కనీసం రెండు రోజుల సమయం పడుతుండగా, ఇకపై ఆ నిరీక్షణకు తెరపడనుంది.

- అక్షర దర్బార్, వరంగల్



# కాంగ్రెస్ బాకీ కార్డుతో బీఆర్ఎస్ ప్రచారం



అక్షర దర్బార్, భూపాలపల్లి:భూపాలపల్లి నియోజకవర్గంలోని గురలవీడు గ్రామంలో బీఎస్ఆర్ పార్టీ నేతలు "కాంగ్రెస్ బాకీ కార్డు"లను ఇంటింటా పంపిణీ చేసి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు అమలులో లేని విషయాన్ని వివరించారు.స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 13 అంశాలు, 100 రోజుల హామీలు, తర్వాతి 420 హామీలు ఇప్పటి వరకు అమలు కాలేదని విమర్శించారు. రుణమాఫీ, బోనస్, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, యువతలకు ఇచ్చిన వాగ్దానాలు కూడా బాకీగా ఉన్నాయని తెలిపారు. బీఎస్ఆర్ పార్టీ నేతలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను బకాయి కార్డు చూపించి నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# క్రాస్ ఎగ్జామినేషన్ కు ఎమ్మెల్యేలు గూడెం, బండ్ల





అక్షరదర్బార్, హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శుక్రవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో విచారణ జరిగింది. క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఇద్దరు ఎమ్మెల్యేలను పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ఎగ్జామినేషన్ చేశారు. అక్టోబర్ 1న అసెంబ్లీలో స్పీకర్ సమక్షంలో ఫిరాయింపు నోటీసులు స్వీకరించిన ఎమ్మెల్యేలను వారిపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అయితే సమయం సరిపోకపోవడంతో.. ఇటీవల ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య విచారణ మాత్రమే పూర్తయింది. ఈక్రమంలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి క్రాస్ ఎగ్జామినేషన్ వాయిదా పడి శనివారం పూర్తయింది.



అక్షర దర్బార్ Voice of the people

## ప్రాదేశిక స్థానం

# హస్తగత వ్యూహం

- లోకల్ ఎన్నికలకు కాంగ్రెస్ రెడీ
- జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థుల కోసం వేట
- పీసీసీకి జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతలు
- ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతలు డీసీసీలకు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**



స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎలక్షన్లలో గెలుపు గుర్రాలను ఎంపిక చేయడంపై పార్టీ ముఖ్య నేతలు దృష్టిపెట్టారు. పార్టీ హైకమాండ్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఎంపిక ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక ఉండాలని భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్, స్థానిక సంస్థల్లోనూ తమ పట్టును నిలుపుకోవాలని, ముఖ్యంగా రాష్ట్రంలో తమ పాలనపై ప్రజల ఆమోదాన్ని మరోసారి చాటుకోవాలని పటిష్టమైన వ్యూహాన్ని రూపొందించింది. ఎంపీటీసీ స్థానాల అభ్యర్థుల ఎంపిక బాధ్యతలను ఆయా జిల్లాల పరిధిలోని డీసీసీలకు అప్పగించింది.

### - వేగంగా ఎంపిక..

క్షేత్రస్థాయిలో ప్రజలతో అనుబంధం, స్థానిక సమీకరణాలు, అభ్యర్థుల గెలుపు సామర్థ్యంపై డీసీసీలకు పూర్తి అవగాహన ఉంటుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. తద్వారా వేగంగా, సమర్థంగా అభ్యర్థులను ఖరారు చేయవచ్చని పార్టీ భావిస్తోంది. అలాగే జిల్లా స్థాయిలో ప్రభుత్వ పరంగా విధానపరమైన పాత్ర పోషించే జడ్పీటీసీ స్థానాల అభ్యర్థుల ఎంపిక బాధ్యతలను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ )కి అప్పగించింది. జడ్పీటీసీ ఎన్నికలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు పరోక్షంగా దారితీస్తాయి కాబట్టి, ఈ అభ్యర్థుల ఎంపికలో మరింత అప్రమత్తత అవసరమని అధిష్ఠానం భావిస్తోంది. రాష్ట్ర నాయకత్వం ఆయా స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించి, బలమైన అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా జిల్లా పరిషత్‌లను కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నది.

### - వ్యూహ ప్రతివ్యూహాలు..

అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ  ఫోకస్ చేసింది. గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నది. పీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు నిరంతరం జిల్లా నాయకులతో సమావేశమై, ఎన్నికల సన్నద్ధతను, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. జిల్లాల్లో ఎన్నికల కమిటీలను ఏర్పాటు చేసి, ప్రచారం, సమన్వయం కోసం కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుండటం తమకు కలిసొచ్చే అంశంగా పార్టీ నాయకులు భావిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, గ్యారెంటీల అమలును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని డీసీసీలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అలాగే రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించిన గత పాలకుల వైఫల్యాలు, స్థానిక సంస్థలకు నిధుల విడుదలలో జరిగిన జాప్యాలను ప్రజలకు వివరించడానికి పార్టీ సిద్ధమవుతోంది.

### - పార్టీ శ్రేణులతో జూమ్ మీటింగ్

స్థానిక సంస్థల ఎన్నికలపై శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో పీసీసీ కార్యవర్గసభ్యులతో పాటు జిల్లాస్థాయిలో డీసీసీ నేతలు, ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు. మీనాక్షి, మహేశ్‌కుమార్ గౌడ్ లోకల్ ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై పార్టీ శ్రేణులకు సలహాలు, సూచనలిచ్చారు.

# ఇక గంటల్లోనే.. చెక్కుల క్లియరెన్స్

- అక్టోబర్ 4 నుంచి  అమలు
- ఉదయం చెక్కు డిపాజిట్ చేస్తే సాయంత్రానికి అకౌంట్ లో జమ

అక్షరదర్బార్, వరంగల్ : సాంకేతికత అందుబాటులోకి వచ్చాక బ్యాంకింగ్ వ్యవస్థలో కాలక్రమంలో ఎన్నో మార్పులొచ్చాయి. ఫోన్ సాయంతో క్షణాల్లోనే నగదు పంపుకొనే వెసులుబాటు లభించింది. మొబైల్ అప్లికేషన్ కారణంగా బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరమే దాదాపు తప్పింది. కానీ, చెక్కు విషయంలో మాత్రం ఆ ఆలస్యం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఏదైనా చెక్కు క్లియర్ అవ్వాలంటే ప్రస్తుతం రెండ్రోజుల సమయం పడుతోంది. ఇకపై ఈ సమయం గణనీయంగా తగ్గనుంది. అక్టోబర్ 4 నుంచి కొన్ని గంటల్లోనే చెక్కు క్లియర్ కానుంది. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకులు శనివారం నుంచి దీన్ని అమలు చేయనున్నాయి. చెక్కులు క్లియర్ చేయడానికి అయ్యే సమయాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించేందుకు ఆర్‌బీఐ కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో చెక్కు సమర్పించిన గంటల వ్యవధిలోనే క్లియర్ అవుతుంది. ఈ విధానంలో వ్యాపార వేళల్లో చెక్కుల స్కానింగ్, సమర్పణ, క్లియరింగ్ అనేవి నిరంతరాయంగా సాగుతాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చెక్కులు సమర్పించవచ్చు. సాయంత్రం 7 గంటల్లోపు క్లియర్ అవుతాయి. అంటే చెక్కు ఉదయం డిపాజిట్ చేస్తే అదే రోజు సాయంత్రానికల్లా నగదు మీ బ్యాంకు ఖాతాలో జమ అయిపోతుంది. సంబంధిత చెక్కును ఆమోదించడమో, తిరస్కరించడమో ఏదైనా సరే సాయంత్రం ఏడుకల్లా జరిగిపోవాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. మొత్తం రెండు దశల్లో ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఫేజ్–1లో భాగంగా సాయంత్రం 7 గంటల్లోపు గడువు నిర్దేశించగా.. ఫేజ్–2లో కేవలం మూడు గంటల్లోనే చెక్కు క్లియర్ చేయాల్సి ఉంటుంది. 2026 జనవరి 3 నుంచి రెండో దశ ప్రారంభమవుతుంది. అంటే బ్యాంకు పని వేళల్లో ఎప్పుడు  చెక్కు సమర్పించినా మూడు గంటల వ్యవధిలోనే బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుంది. అంటే ఉదయం 10 గంటలకు చెక్కు సమర్పిస్తే మధ్యాహ్నం ఒంటిగంటకల్లా దాన్ని బ్యాంకులు క్లియర్ చేయాల్సి ఉంటుందన్నమాట. దీనికోసం మునుపటిలా రోజులతరబడి వేచి చూడాల్సిన అవసరం తప్పుతుంది.



# 42% బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్

- తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సందిగ్ధత
- ఇప్పటికే హైకోర్టులో ఒక పిటిషన్.. ఈ నెల 8న విచారణ
- ఈలోపే సుప్రీం కోర్టులో మరో పిటిషన్
- రాజకీయ వర్గాల్లో తీవ్రమైన ఉత్కంఠ

అక్షరదర్బార్, న్యూఢిల్లీ: తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సవాల్ చేస్తూ వంగా గోపాల్ రెడ్డి అనే వ్గక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించడాన్ని పిటిషనర్ చట్ట విరుద్ధమని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రతివాదులుగా తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని చేర్చారు. ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టులోనూ విచారణ ఎదుర్కొంటోంది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీ చేసిన తీర్మానం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ప్రభుత్వం జీవో ఇవ్వాల్సిన అవసరం ఏమిటని హైకోర్టు గతంలో ప్రశ్నించింది. ఎన్నికల ప్రక్రియను పది రోజులు నిలుపుదల చేయాలని సూచించిన కోర్టు, ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టులో కేసు ఉన్న కారణంగా రిజర్వేషన్ల అమలుపై తీవ్ర సందిగ్ధత నెలకొన్నప్పటికీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాత్రం ఆలస్యం చేయకుండా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు రెండు విడతలుగా, సర్పంచ్ ఎన్నికలకు మూడు విడతలుగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, రిజర్వేషన్లపై కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 6న సుప్రీంకోర్టు, 8న హైకోర్టు ఇచ్చే తీర్పులే తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. ఒకవేళ న్యాయస్థానాలు రిజర్వేషన్ల పెంపును రద్దు చేస్తే, ప్రస్తుతం ప్రకటించిన ఎన్నికల ప్రక్రియ మరియు రిజర్వేషన్ల కేటాయింపులు మారే అవకాశం ఉంది. దీంతో ఆశావహుల్లోనూ, రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర ఆందోళన కనిపిస్తోంది.ఇప్పటికే హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఈ నెల 8న ఆ పిటిషన్‌పై విచారణ జరుగనున్నది. ఈలోపే సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలు కావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్రమైన ఉత్కంఠ నెలకొన్నది.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం మాందారిపేట జాతీయ రహదారి పై ఎస్సై జె.పరమేశ్వర్ శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు . ఈ సందర్భంగా ద్విచక్రవాహనాలను ఆపి వారికి బ్రీ త్ ఎనలైజర్ తో తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా, అనుమతి పత్రాలు లైసెన్స్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల చేసిన పెద్ది

నల్లబెల్లి, అక్షర దర్బార్: కాంగ్రెస్ 420 హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వినూత్న కార్యక్రమం చేపట్టింది. నర్సంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పెద్ది ఆధ్వర్యంలో నల్లబెల్లిలో "కాంగ్రెస్ బాకీ కార్డు"ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ 22 నెలల పాలనలో మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. మాటల గారడితో ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి




రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని ఆరోపించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని ప్రజలను ఆయన కోరారు. "ప్రజా పాలన" పేరిట ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

# నూతన వధూవరులకు ఆశీర్వాదాలు

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు వర్దం నర్సింహారెడ్డి–సాయి ప్రసన్న వివాహం GRB ఫంక్షన్ హాల్లో శనివారం జరుగగా వేడుకలకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.





# ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

అక్షరదర్బార్, వరంగల్: జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆమె శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ అంకిత్ కుమార్, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, శాంతిభద్రతలు (లా అండ్ ఆర్డర్), సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు, రూట్ మ్యాప్ ల తయారీ, రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతుల మంజూరు వంటి కీలక అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో స్థానిక సంస్థల, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, మొదటి విడతలో 5 మండలాలు, రెండవ విడతలో 6 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయని అన్నారు. ఎన్నికల




శాంతియుత నిర్వహణకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి)ను కఠినంగా అమలు చేయాలని, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి లైవ్ వెబ్ కాస్టింగ్, ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ ఓలు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు టాయిలెట్స్, ఫర్నిచర్, ర్యాంప్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రహరీ గోడలు లేని పోలింగ్ కేంద్రాలకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులు సమన్వయంతో రూట్ మ్యాప్ లు రూపొందించాలని, రాజకీయ పార్టీల ప్రచారాలకు అవసరమైన అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని నియమించి, ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ కల్పించాలని అన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ, మద్యం పంపిణీ, బెదిరింపులు, అక్రమ ప్రచారాలు వంటి ఉల్లంఘనలపై నిరంతరం నిఘా పెట్టి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించాలని అన్నారు. మండల కేంద్రాల్లో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ , ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనల, విధులపై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత పోరపాట్లు జరగకుండా బ్యాలెట్ పేపర్ల ముద్రణ జరగాలని అన్నారు.

# దీర్ఘకాలిక సెలవులో మార్కెట్ కార్యదర్శి



అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న గుగులోతు రెడ్డి ఈనెల 4వ తేదీ నుంచి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత కార్యదర్శి నిర్మల సీసీఐ కొనుగోళ్ల విషయంలో సస్పెన్షన్‌కు గురి కావడంతో ఆమె స్థానంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జి రెడ్డికి వరంగల్ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన 12 ఫిబ్రవరి 2025న ఎఫ్ఏసీగా బాధ్యతలు చేపట్టారు. గత నెల నిర్మల పదవీ విరమణ పొందడంతో వరంగల్ మార్కెట్ కార్యదర్శి క్లియర్ వేకేన్సీగా ఏర్పడింది. సీసీఐ కొనుగోళ్లు ఈ నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించాల్సి ఉంది. ఈక్రమంలో జి రెడ్డి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రెండు మార్కెట్ల నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నందున సెలవుపై వెళ్లారన్న ప్రచారం జరుగుతోంది. కాగా వరంగల్ మార్కెట్‌కు పూర్తి స్థాయిలో కార్యదర్శిగా వచ్చేందుకే దీర్ఘకాలిక సెలవు పెట్టారంటూ చర్చ సాగుతోంది. ఈనెల 28వ తేదీ వరకు సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా ఆయా మార్కెట్లలోని గ్రేడ్–2 కార్యదర్శులకు బాధ్యతలు ఉన్నతాధికారులు అప్పగిస్తారని తెలుస్తోంది.

# దివ్యాంగురాలికి అండగా బీసీ సంఘం

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం: వీరభద్రవరం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మాటూరి రమణ అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ముందుకు వచ్చారు. ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు మంచెర్ల నాగేశ్వరరావు, వెంకటాపురం మండల కార్యదర్శి బట్ట నాగేందర్ రమణను పరామర్శించి, ఆమె కుటుంబానికి రూ.3వేల నగదు, 25 కేజీల బియ్యం అందజేశారు. ఆపదలో అండగా నిలిచిన సంఘ ప్రతినిధులకు రమణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువజన సభ్యులు సోలం సుధాకర్, సోలం ఓంపతి, పోడం సురేష్, బంధ రాము, గగ్గురి రమేష్, బట్ట నారాయణ, పొనగంటి కృష్ణారావు, దర్రాజు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# బహుజన రాజ్యాధికారం సాధించుకోవాలి

**బీఎస్పీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి గౌడ్**

అక్షర దర్బార్, చిట్యాల: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి గౌడ్ తెలిపారు. గ్రామ వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో పార్టీ తరపున అభ్యర్థులను బరిలోకి దింపుతామని ఆయన చెప్పారు. రిజర్వేషన్ల ప్రకారం BC, SC, ST, మైనార్టీలకు అవకాశాలు కల్పించి బలంగా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. అగ్రవర్ణాల రాజకీయ కుట్రలను



బహిర్గతం చేస్తూ రాజ్యాధికార ప్రాముఖ్యతను ఇంటింటికీ తీసుకెళ్తామని భిక్షపతి గౌడ్ అన్నారు. రాష్ట్రంలో 92 శాతం ఉన్న బహుజనులను అధికార పీఠంపై కూర్చోబెట్టడమే బీఎస్పీ లక్ష్యమని తెలిపారు. "ఎన్నికల్లో పోటీ చేయకపోతే మన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ ఎన్నికలను మన భవిష్యత్తుగా భావించి ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

# స్థానిక "సంగ్రామం"పై ఇంటెలిజెన్స్ ఆరా!

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ అధికారులు గ్రామ గ్రామాన పర్యటిస్తూ, గెలుపు–ఓటముల సమీకరణాలను అంచనా వేస్తున్నారు. శనివారం మొగుళ్లపల్లి మండలంలోని ములకలపల్లి, పిడిసిల్ల, మొట్లపల్లి, మెట్టిపల్లి తదితర గ్రామాల్లో ఇంటెలిజెన్స్ అధికారులు పర్యటించినట్లు సమాచారం. ఎన్నికల బరిలో నిలిచే ఆశావహుల వివరాలు సేకరించడంతో పాటు, గత ప్రభుత్వ పనితీరు, ప్రస్తుత ప్రభుత్వ పథకాల ప్రభావంపై ప్రజాభిప్రాయాలను ఆరా తీశారు. ప్రత్యేకంగా ఖరీఫ్ సీజన్లో యూరియా కొరత, అలాగే ఉచిత బస్సు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల ప్రభావం ఎన్నికల ఫలితాలపై ఏ మేరకు ఉంటుందో అంచనా వేస్తున్నట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతున్న తరుణంలో, అక్టోబర్ 8న హైకోర్టు తీర్పు వెలువడిన తరువాతే ఎన్నికల సమరంపై పూర్తి స్పష్టత రావచ్చని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

# కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు షురూ..



అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట పట్టణ గౌడ గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వర స్వామి, రేణుక ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శి మద్దెల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా కంఠమహేశ్వర స్వామి–సూరమాంబదేవి, రేణుక ఎల్లమ్మతల్లి–జమదగ్ని మహారాజ్, వనమైసమ్మ దేవతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు గాదగొని సాంబయ్య గౌడ్, ఆర్థిక కార్యదర్శి నాతి సదానందం గౌడ్, డైరెక్టర్లు తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, మొగలగాని సురేష్ గౌడ్, వేముల కృష్ణ గౌడ్, గిరగాని రమేష్ గౌడ్, నాగెల్లి ప్రమోద్ గౌడ్ పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

అక్షర దర్బార్, సంగెం: కుంటపల్లి గ్రామానికి చెందిన పాలకేంద్ర ఖాతాదారు కర్దూరి సంజీవ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సంగెం పాలకేంద్రం సేకరణదారు పులి రాజశేఖర్ ఆధ్వర్యంలో పాల ఖాతాదారులు అందరూ కలిసి, సంజీవ కుమారులు రాకేష్, వెంకటేష్‌లకు రూ.5వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పాలకేంద్ర రైతులు గోలి అశోక్, సింగం రాజు, యార శ్రీకాంత్, ఎరుకల శంకరలింగం, పెంతల శ్రవణ్, పెల్లి శంకర్, యార బాలకృష్ణ, జున్న రాజు యాదవ్, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా పట్టివేత

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం గంగిరెణిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి గుడుంబా అమ్ముతుండగా అట్టి గుడుంబాను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకునట్లు శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ తెలిపారు.ఎస్ఐ కథనం ప్రకారం పోలీస్ సిబ్బందితో శాయంపేట మండలంలోని గంగిరెణిగూడెం గ్రామం నందు పెట్రోలింగ్ చేస్తుండగా బానోత్ రమేష్ ఇంటి వద్ద గుడుంబా అమ్ముతున్నాడనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లి దాడి చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సహాయక కేంద్రం

అక్షరదర్బార్, హనుమకొండ: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సహాయక కేంద్రంను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన సహాయక కేంద్రం 24/7 పాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. జడ్పిటిసి, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సహాయక కేంద్రం ఫోన్ నెంబర్ 7981975495 ను సంప్రదించాలని జిల్లా ప్రజలకు సూచించారు.

# ప్రజావాణి రద్దు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని పేర్కొన్నారు.


# స్థానిక పోరులో సత్తా చాటాలి

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో శనివారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయాన్ని సాధించాలని, బీజేపీ అభ్యర్థులు గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ దేశ వ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందుతోందని తెలంగాణలో కూడా అదే ధోరణి కొనసాగుతోందని అన్నారు.

# బీజేపీ విజయమే ప్రజా అభివృద్ధి

### బీజేపీ రాష్ట్ర నేత డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు



అక్షరదర్బార్, పరకాల: స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని శనివారం వరంగల్ లోని వజ్ర గార్డెన్స్ లో పరకాల నియోజకవర్గంలోని అన్ని మండలాల బీజేపీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు గెలవడానికి ప్రతీ కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని, పార్టీ విజయమే ప్రజా అభివృద్ధికి దారి తీస్తుందని అన్నారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కే సంతోష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మరావు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ్ చెందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, కాచం గురుప్రసాద్, సీనియర్ నాయకులు మంద ఐలయ్య, కన్నెబోయిన రాజయ్య యాదవ్, వంగల సమ్మిరెడ్డి, జయంత్ లాల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.






# ఆర్వోల పాత్ర కీలకం

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో వారిదే ముఖ్య పాత్ర
- జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

అక్షరదర్బార్, వరంగల్: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శనివారం జిల్లా పరిషత్తు కార్యాలయంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డితో కలసి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కొరకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా కార్యదీక్షతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రతి విషయంలో అత్యంత జాగ్రత్త పాటించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి రిటర్నింగ్ అధికారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి మండలంలో మూడు లేదా నాలుగు ఎంపీటీసీలకు ఒక రిటర్నింగ్ అధికారిని, ప్రతి జడ్పీటీసీకి రిటర్నింగ్ అధికారిని నియమించామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకత్వాలు రిటర్నింగ్ అధికారుల డైరీలో సవివరంగా ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని దానికనుగుణంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ నియమావళి ప్రకారం ఎన్నికల నోటీసు ఇవ్వాలని, నామినేషన్ల పేపర్ల స్వీకరణ, రిటర్నింగ్ అధికారి కార్యాలయం నోటీసు బోర్డుపై స్వీకరించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాల జాబితా, స్వీయ ప్రకటన ప్రతులను ప్రచురించాలని, నామినేషన్ పత్రాల పరిశీలన, ఏదేని నామినేషన్ పత్రాన్ని తిరస్కరించినచో దానికి గల కారణం తెలపాలని, నామినేషన్ పత్రాల జాబితా ప్రచురించాలని, అభ్యర్థుల ఉపసంహరణ నోటీసు స్వీకరించాలని, పోటీ చేసే జాబితా, గుర్తుల కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్ పేపర్, పోలింగ్ కేంద్రాలు ఉపయోగించే బ్యాలెట్ పేపర్ ముద్రణ, ప్రతిరోజు పర్యవేక్షించాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించేవరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని అన్నారు. ఏరోజుకారోజు పీపుల్ సాఫ్ట్వేర్ లో ఆర్ ఓలు నివేదికలను ఎలక్షన్ ప్రాసెస్ మాడల్ ను ఉంచాలన్నారు.

# స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి చెత్త బుట్టల పంపిణీ
- మోడల్ డివిజన్ లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం




అక్షరదర్బార్, వరంగల్: నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం నగర పరిధిలోని 29వ డివిజన్ ను మోడల్ డివిజన్ గా చేపట్టి స్వచ్ఛ భారత్ లో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి శానిటేషన్ పై అవగాహన కల్పించడంతో పాటు స్థానికులకు తడి పొడి చెత్తను వేరుగా అందించడానికి వీలుగా చెత్త బుట్టలను మేయర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తడి పొడి చెత్తను వేరుగా అందించడానికి వీలుగా ప్రజల్లో అవగాహన కలిగించడానికి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా 29 డివిజన్ ను మోడల్ డివిజన్ గా తీసుకొని తొలిసారిగా అవగాహన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. రామన్నపేటలో 11వ బ్లాక్ గాంధీ విగ్రహం ప్రాంతంలో స్థానికులకు చెత్త బుట్టలను పంపిణీ చేయడం జరిగిందని, బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్లలో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. తడి చెత్తను ప్రతి రోజు డంప్ యార్డుకు చేర్చడం, తద్వారా అక్కడ నిప్పు రాజేయబడి దాని నుండి వచ్చే పొగ వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, గృహిణులు తడి చెత్తను కార్పొరేషన్ నుంచి వచ్చే చెత్త తరలింపు వాహనాలకు ఇవ్వకూడదని భావిస్తే వారే ఇంటి వద్దనే తడి చెత్తను ప్రాసెసింగ్ చేయడం ద్వారా 21 రోజుల తర్వాత కంపోస్ట్ ఎరువు (మట్టిగా) తయారు అవుతుందని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ ఓ డా రాజారెడ్డి, ఎంహెచ్ ఓ డా రాజేష్, సానిటరీ సూపర్వైజర్ గోల్కొండ శ్రీను, భద్రకాళి దేవస్థాన ధర్మకర్త ఓరుగంటి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే దొంతికి మాతృ వియోగం

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ శనివారం స్వర్గస్తులయ్యారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. కాంతమ్మ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు విషాదంలో మునిగిపోయారు. హనుమకొండలోని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నివాసంలో రాత్రి 9 గంటల నుంచి కాంతమ్మ పార్థీవ దేహాన్ని ప్రజలు, అభిమానులు, రాజకీయ నాయకులు దర్శించుకునేందుకు ఉంచనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం హనుమకొండలోని పద్మాక్షి గుట్ట వద్దగల శివముక్తి ధామ్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాంతమ్మ మృతిపై పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సంతాపం తెలిపారు.